క్లుప్తంగా

కొత్తపల్లిలో కొనసాగుతున్న పూజలు



ఆలయంలో భజన నిర్వహిస్తున్న భక్తులు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్త పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మే 31న ప్రారంభమైన పూజా కార్యక్రమాలు సోమవారం వరకు కొనసాగనున్నాయి. ఆదివారం గణపతి పూజ, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 2వ తేదీన నవగ్రహ, ధ్వజ, శిఖర యంత్ర జింబ ప్రతిష్ఠాపన అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మల్లు రవికి స్వాగతం



మల్లు రవికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియామకమైన డాక్టర్ మల్లు రవి ఆదివారం ఢిల్లీ నుంచి రావడంతో ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్, రవి, ఇబ్రహీం, ఖదీర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న భిక్షపతిగౌడ్

మొయినాబాద్‌రూరల్: క్రీడలు శరీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని టోర్నమెంట్ నిర్వాహకుడు భిక్షపతిగౌడ్ అన్నారు. ఆదివారం భిక్షపతిగౌడ్ తండ్రి కీర్తిశేషులు యాదయ్యగౌడ్ జ్ఞాపకార్థం మండల పరిధిలోని ఆయా గ్రామాల యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలో తొమ్మిది జట్లు పాల్గొనగా బాకారం గ్రామానికి చెందిన ఓజీసీ టీమ్ క్యాప్టెన్ ప్రవీణ్‌యాదవ్ టీమ్ గెలుపొందారు. అనంతరం నిర్వాహకులు వేజేతలకు నగదు, షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ విద్యార్థులకు కిక్ ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు కిక్ ప్యాడ్‌లు అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కొందుర్గు: కొందుర్గు న్యూమాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులకు మాజీ ఉపసర్పంచ్ శుకూర్ కిక్ ప్యాడ్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు యుద్ధ విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం శుకూర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్లు రమేశ్, శివశంకర్, రాజు, నాయకుడు మానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు నాయకులు అన్నారు. మున్సిపాలిటీలోని ఇబ్రహీంపల్లి వార్డులో ఆదివారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు!

గుంతలమయంగా అంగడిచిట్టంపల్లి రోడ్డు

- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా మారిన అంగడిచిట్టంపల్లి గేటునుంచి కంకల్ వెళ్లే రోడ్డు

పూడూరు: అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుని నోట్లో శని అనేలా మారింది అంగడిచిట్టంపల్లి–లాల్‌పహాడ్ బీటీ రోడ్డు పరిస్థితి. నిధులు మంజూరైనా పనులు చేయకపోవడంతో రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు.. నిత్యం వేలాది మంది ప్రయాణించే అంగడిచిట్టంపల్లి– లాల్‌పహాడ్ మార్గం దుస్థితి. ఇది రెండు జిల్లాల మధ్య దాదాపు 40 గ్రామాలను కలుపుతుంది. షాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, పరిగి తదితర పట్టణాలకు వెళ్లేందుకు ఈ రహదారి అనుకూలంగా ఉంటుంది. 23 కిలోమీటర్లు ఉన్న రోడ్డులో కంకల్ వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. మరో 14 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్యాచ్ వర్క్‌లతో సరి..

ఈ మార్గంలో పూడూరు మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. గతంలో ప్యాచ్ వర్క్ చేసి వదిలిపెట్టారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనాదారులు చెబుతున్నారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరాయి. కంకల్, చన్గోముల్ బ్రిడ్జిలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. ప్రధాన రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లు దయనీయంగా మారాయి. లాల్‌పహాడ్ నుంచి కంకల్ వరకు రోడ్డును తవ్వి వదిలేశారు. కంకల్ నుంచి అంగడిచిట్టంపల్లి గేటు వరకు రహదారి ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బీటీ రోడ్డు ధ్వంసం



అంగడిచిట్టంపల్లి గేటు నుంచి లాల్‌పహాడ్ వరకు బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ రూట్లో ఆటోలు సైతం తిరగడం లేదు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

– రవీందర్, కంకల్

చర్యలు తీసుకోవాలి



అంగడిచిట్టంపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. లాల్‌పహాడ్ నుంచి కంకల్ వరకు రహదారిని మరమ్మతులు చేయలేదు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు వేయించేలా చర్యలు తీసుకోవాలి.

– రఫీస్‌ఖాన్, చన్గోముల్

ప్రతిపాదనలు పంపాం

లాల్‌పహాడ్ నుంచి కంకల్ వరకు రూ.20 కోట్ల వ్యయంతో తొమ్మిది కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మంజూరైంది. బిల్లుల చెల్లింపులో అలసత్వంతో పాటు వర్షాల కారణంగా కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. కంకల్ నుంచి అంగడిచిట్టంపల్లి గేటు వరకు 14 కిలోమీటర్లు డబుల్ రోడ్డుకు రూ.40 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. వర్క్ ఆర్డర్ వస్తే పనులు ప్రారంభిస్తాం.

– మహేశ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, పరిగి

ముమ్మరంగా వ్యవసాయ పనులు

- పొలం పనుల్లో బిజీ బిజీ..
- ముందస్తుగా విత్తనాలు విత్తుతున్న రైతులు



రోటిబంట తండాలో విత్తనాలు చల్లుతున్న కూలీలు

దుద్యాల్: వానకాలం పంటల సాగుకు వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో విత్తనాలు విత్తుతున్నారు. మే లో కురిసిన వర్షాలకు ముందస్తుగా చదును చేసుకున్న రైతులు ప్రస్తుతం విత్తే పనిలో నిమజ్జమయ్యారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలు, పెసర, బొబ్బర్లు, కందులు వంటివి విత్తుతున్నారు. మరికొంత మంది పొలాలను చదును చేసుకునే పనిలో ఉన్నారు. ఇంకొందరు ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఏ పొలంలో చూసినా కూలీలు, ట్రాక్టర్లతో దుక్కులు దున్నడం, అచ్చులు వేసే యంత్రాలు దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ పనులు మొదలు కావడంతో కూలీలకు చేతినిండా పని దొరుకుతుందని ఆనందం వ్యక్త చేస్తున్నారు.

డంప్‌యార్డుగా క్రీడా ప్రాంగణం



మైదానంలో వేసిన పాలిథిన్ కవర్లు, చెత్తాచెదారం

- నిర్వహణ లేక నిరుపయోగం
- క్రీడలకు దూరమవుతున్న యువత
- పట్టించుకోని అధికారులు



బోర్డుకే పరిమితమైన క్రీడాప్రాంగణం

మొయినాబాద్: క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో లక్షలు వెచ్చించిక్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ అవి కొన్ని చోట్ల నిర్వహణ లోపంతో యువకులకు ఉపయోగపడటం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో హిమాయత్‌నగర్‌లో గల క్రీడా ప్రాంగణం డంపింగ్‌యార్డుగా మారింది. దీంతో క్రీడాకారుల అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది.

రాత్రి సమయాల్లో యథేచ్ఛగా..

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో క్రీడా ప్రాంగణాన్ని డంపింగ్‌యార్డు చేశారు. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి, నార్సింగ్ మున్సిపాలిటీ ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో చెత్తాచెదారం, పాలిథిన్ కవర్లు సంచుల్లో తీసుకొచ్చి మైదానంలో పారబోస్తున్నారు. కొంతకాలంగా యథేచ్ఛగా చెత్త డంప్ చేస్తున్నా స్థానిక మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్‌లోని చెత్తను సైతం ఇదే క్రీడా ప్రాంగణంలో వేస్తున్నారంటే అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే చెత్త డంప్ చేస్తుండడంతో దుర్వాసనతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు దోమలతో పరిసరాల్లో ఉన్న హాస్టల్ విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు.

అధ్వానం.. ఎన్కెపల్లి లింకు రోడ్డు



కంకర తేలిన రోడ్డు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా తయారైంది. కంకర తేలి దయనీయంగా మారింది. ఈ రోడ్డు గుండా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. జిన్నారం గేటు నుంచి ఎన్కెపల్లి మీదుగా బంట్వారం, తొర్మామిడి, కర్ణాటకలోని కుంచారం వెళ్లే వారికి చాలా సులువుగా ఉంటుంది. ప్రస్తుతం రోడ్డు బాగ లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు దూర ప్రాంతాల నుంచి చుట్టూ తిరిగి గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ఎన్కెపల్లి లింకు రోడ్డుకు మరమ్మతులు చేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ రోడ్డును మరమ్మతులు చేయించకపోవడంతో ఏళ్ల తరబడి సమస్యను పట్టించుకునే వారు లేరు. దీంతో ద్విచక్ర వాహనదారులు తరచుగా అదుపు తప్పి ప్రమాదాల బారిన గురవుతున్నారు. కంకర తేలిన ఈ రోడ్డుపై రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎవరైనా ఆదమరిచి అటుగా వెళ్తే ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలైన సంఘటలు అనేకం ఉన్నాయి. కంకర తేలిన ఈ రోడ్డుపై కాలి నడకన కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా ఎన్కెపల్లికి సకాలంలో చేరుకోవడం లేదు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

తాండూరు రూరల్: సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ తారాసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై అవగాహన కల్పించనున్నారని తెలిపారు. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లు రెండు టీంలుగా ఏర్పడి రెండు గ్రామాల్లో వేరువేరు సదస్సులు నిర్వహిస్తారని తహశీల్దార్ తారాసింగ్ తెలిపారు.

వైభవంగా దేవాలయ బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో గల శ్రీదశావతార లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రివరకు అర్చకులు శ్రీమాన్‌నడాదూర్ వెంకట రాఘవన్, శ్రీమాన్ వెంకటనాదాచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం

తంగడపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి రూ.1 లక్ష 51 వేలు, శ్రీదశావతార సహిత లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు 51 వేల రూపాయల విరాళాన్ని ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఆదివారం గ్రామంలోని ఆలయాలను సందర్శించిన ఆయన ఈ విరాళానికి సంబంధించి చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



కేశంపేట తహసీల్దార్ కార్యాలయం

కేశంపేట: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ అజాంఅలీ తెలిపారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ నెల 3వ తేదీ నుంచి రెండు టీమ్‌ల ద్వారా భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. మొదటి టీమ్‌లో తహసీల్దార్ అజాంఅలీ, అసిస్టెంట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివేదిత, సర్వేయర్ సాయిబాబాతో పాటు కార్యాలయ సిబ్బంది 5 మందితో కలిసి 3న బోధునంపల్లి, 4న లేమామడి, 5న కొత్తపేట, 6న సంతాపూర్, 9న దత్తాయపల్లి, 10న తొమ్మిదిరేకుల, 11, 12న నిర్దవెల్లి, 13, 16న అల్వాల, 17, 18న కేశంపేట, 19, 20న సంగెం గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. అదేవిధంగా రెండో టీమ్ సభ్యులు నాయబ్ తహసీల్దార్ గీత, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులుతో పాటు మరో 5 మంది కార్యాలయ సిబ్బందితో కలిసి 3న లింగంధన, 4న ఇప్పలపల్లి, 5న బైర్కాన్‌పల్లి, 6న ఎక్లాస్‌ఖాన్‌పేట, 9న చింతకుంటపల్లి, 10న చౌలపల్లి, 11, 12న వేములనర్వ, 13, 16న పోమాల్‌పల్లి, 17, 18న కాకునూర్, 19, 20న పాపిరెడ్డిగూడ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సులను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోండి

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వర్ సూచించారు. అధికారులు రెండు టీమ్‌లతో ఆయా గ్రామాల్లో పర్యటించి ఈ నెల 3 నుంచి 20వ తేదీవరకు సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 3న ఈదులపల్లి, 4న మోత్కులగూడ, 5న వీర్లపల్లి, 6న అప్పారెడ్డిగూడ, 9న నందిగామ, 10న మేకగూడ, 11న రంగాపూర్, 12న చాకలిదానిగుట్ట తండా, 16న అంతిరెడ్డిగూడ గ్రామాల్లో తహసీల్దారు రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ అభినవ్, చైన్ మ్యాన్ వెంకటయ్య, ఆపరేటర్ శరత్ చంద్ర రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

మరో టీమ్..

3న మామిడిపల్లి, 4న మొదళ్లగూడ, 5న శ్రీనివాసులుగూడ, 6, 9 తేదీలలో చేగూరు, 10న బుగ్గోనిగూడ, 11న బండోనిగూడ, 12న వెంకమ్మగూడ, 16న తాళ్లగూడ, 17న కన్హాలో, 18న నర్సప్పగూడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టీమ్‌లో నయాబ్ తహసీల్దారు లక్ష్మయ్య, ఎంపీఎస్‌ఓ నరేందర్, ఎంఆర్‌ఐ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ సతీశ్వర్, రికార్డ్ అసిస్టెంట్ మల్లేశ్, ధరణి ఆపరేటర్ సతీశ్ పాల్గొంటారని వివరించారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు ఉద్యమకారుల వినతి



ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హైద్రాబాద్‌లోని ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆయన స్వగృహంలో కలిసి ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన ఉద్యమాల్లో తమ జీవితాలను పణంగా పెట్టి ఆర్థికంగా నష్టాలను అనుభవిస్తూ ఉద్యమంలో పాల్గొన్నామన్నారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ఆవిర్భావం రోజు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నియోజకవర్గంలో అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారి కుటుంబాలకు కనీసం రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యమంలో పాల్గొన్న వారికి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటుగా గౌరవ భృతిని చెల్లించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు టీజీ శ్రీనివాస్, ఆర్ల యాదయ్యయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, గాదె సుధాకర్, అద్దెట్ల రాజు, బాలునాయక్, జాంగారి నర్సింలు, రవికుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం

షాద్‌నగర్: కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని పట్టణ సెంట్రింగ్ సంఘం అధ్యక్షుడు నడికూడ ఆంజనేయులు అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెంట్రింగ్ అసోసియేషన్ సభ్యులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. తద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అసోసియేషన్ సభ్యులందరం కలిసి సంఘం కార్యాలయాన్ని నిర్మించుకుంటున్నామని, త్వరలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టేకులపల్లి నర్సింలు, పాత్లావత్ భాస్కర్, రమేశ్‌నాయక్, నర్సింలు, రాజు, అలీ, రవి, మధు, నర్సింహ, చందు, లక్ష్మణ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

బీజేపీ మండల అధ్యక్షురాలు రాధిక

కేశంపేట: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక అన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలను పెంచడంపై మండల కేంద్రంలో ఆదివారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో సకాలంలో కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేస్తోందన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేతకాని హామీలను ఇచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆమె అశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు విఠల్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కుమ్మరి మహేశ్, రొల్లు రఘురాంగౌడ్, శివాజీ, పాలాది శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో నిర్వహించిన జూనియర్ చేగూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం ఏర్పడుతుందని, మానసింకంగా, శారీరకంగా దృఢంగా తయారయ్యేందుకు ఇలాంటి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇలాంటి క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అంతకుముందు వెంకమ్మగూడ, చేగూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, నాయకులు మంకాల శ్రీశైలం, ధారురు సతీశ్, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, చిందం నర్సింహ, అన్వర్ పాల్గొన్నారు.